ప్రజాశక్తి

బుధవారం 19 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

2.68 లక్షల మంది రైతులకు

రూ.180.36 కోట్లు..

నేడు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ పథకం రెండో విడత జిల్లాలో రైతుల ఖాతాలకు నేడు నిధులు జమ కానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నారు. కేంద్రం ఒక్కో విడతకు రూ.2 వేలు చొప్పున మూడు విడతలలో రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలలో రూ.5 వేలు చొప్పున, మూడో విడత రూ.4 వేలు అందజేస్తోంది. పిఎం కిసాన్‌లో రూ.2 వేలు, అన్నదాత సుఖీభవలో రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయనున్నారు. జిల్లాలోని 2,68,165 మంది రైతులకు రూ.180.36 కోట్లు సాయం అందనుంది. దర్శి నియోజకవర్గంలోని రైతులకు అత్యధికంగా రూ.28.63 కోట్లు, ఒంగోలు నియోజకవర్గంలో అత్యల్పంగా రూ.6.15 కోట్లు రైతుల ఖాతాలలో జమ కానున్నాయి.

నియోజకవర్గం	రైతులు	జమయ్యే నగదు (కోట్లలో)
దర్శి	42,871	రూ.28.63
గిద్దలూరు	37,649	రూ.25.38
కనిగిరి	42,302	రూ.28.42
కొండపి	36,808	రూ.24.72
మార్కాపురం	32,965	రూ.22.30
ఒంగోలు	9260	రూ.6.15
సంతనూతలపాడు	27,036	రూ.18.48
యర్రగొండపాలెం	39,274	రూ.26.29

ప్రకాశం..భేష్.!

- వాటర్‌షెడ్ పనుల్లో ఉత్తమ పనితీరు
- జాతీయస్థాయిలో రెండో స్థానం
- కేంద్ర జలశక్తిశాఖ మంత్రి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ రాజాబాబు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాన నీటిని ఒడిసిపట్టడంలో జిల్లా యంత్రాంగం చేసిన కషి ఫలించింది. అడుగంటిన భూగర్భ నీటిమట్టాన్ని తిరిగి ఆశావహ స్థితికి తీసుకురావడంలో సఫలీకతమైంది. ఏకంగా కేంద్ర ప్రభుత్వమే మెచ్చి... ప్రశంసాపత్రం ఇచ్చి.. శభాష్ అంటూ అభినందించింది. వాటర్‌షెడ్ పనులలో భాగంగా ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులను కేంద్ర జలశక్తి శాఖ గుర్తించింది. జిల్లా యంత్రాంగం చేసిన కషికి గుర్తింపుగా 'రెండవ జాతీయ ఉత్తమ నీటి పురస్కారం' అవార్డును ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ నుంచి ప్రకాశం కలెక్టర్ పి.రాజాబాబు ఈ అవార్డు అందుకున్నారు. ఆరో జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు కనిగిరి నియోజకవర్గం, పెదచెర్లోపల్లి మండలం, మురుగమ్మి గ్రామ పంచాయతీ ఎంపికైంది.

నేపథ్యం ఇదీ!

2022-23 సంవత్సరంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వాటర్ షెడ్ పథకంలో భాగంగా నీటి సంరక్షణ పనులను చేపట్టారు. వాటర్ షెడ్ నిధులు, ఇతర డిపార్ట్మెంట్ల భాగస్వామ్యంతో ▶ 2లో

ఇసుక రేవులున్న ప్రాంతాల్లో

సిసి కెమెరాలు తప్పనిసరి

- వాల్టా చట్టం ఆధారంగా రేవులకు అనుమతి
- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

ఇసుక రేవులు ఉన్న ప్రాంతాలలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి.. వాటిని ఇంటర్నెట్ ద్వారా కలెక్టరేట్‌కు అనుసంధానం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పర్యావరణ అనుమతులు, వాల్టా చట్టం ఆధారంగా ఇసుక రేవులకు అనుమతి ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్ణానది పరివాహక ప్రాంతాలలో ఇసుక లభ్యత ఉందన్నారు. కొల్లూరు మండలం, జువ్వలపాలెం ఇసుక రేవులో 14.960 హెక్టార్ల ఇసుక లభ్యత ఉందన్నారు. స్థానికుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఆ ప్రాంతం నుంచి ఇసుక తవ్వడానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రజా అభిప్రాయ సేకరణ నిబంధన అనుసరించి వేగంగా చేపట్టాలన్నారు. ఓలేరు రేవులో ఇసుక తవ్వకాలు జరపడానికి ముందస్తు పరిశీలన చేయాలన్నారు. నూతనంగా కొల్లూరు మండలంలోని చిలుమూరు, గాజుర్లంక వద్ద మూడు రేవులను గుర్తించినట్లు తెలిపారు. సాంకేతిక నిపుణులు, కమిటీలోని ఆయా శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. చిలుమూరు ఇసుక రేవులో 4.9 హెక్టార్లలో ఇసుక లభ్యత ఉందన్నారు. గాజుర్లంక-ఎ ప్రాంతంలో 4.9 హెక్టార్లు, గాజుర్లంక-బిలో 4.9 హెక్టార్ల ఇసుక సిద్ధంగా ఉందన్నారు. ఆ ప్రాంతాల్లో తవ్వడానికి అధికారికంగా అనుమతులు రావాల్సి ఉందన్నారు. వాల్టా చట్టం ఆధారంగా పర్యావరణ అనుమతులను పరిశీలించాలన్నారు. భూగర్భజలాల సమతుల్యత పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి రామచంద్ర, భూగర్భ జలశాఖ ఏడీ సురేష్, డిటిఒ పరంధామరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అనంతరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆత్మహత్యకు యత్నించిన మహిళ

ప్రజాదర్బార్ వద్ద

మహిళ ఆత్మహత్యాయత్నం

న్యాయం చేయాలని ఆవేదన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ వద్ద ఓ మహిళ వాస్మాయిల్ తాగి.. ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే స్థానికులు ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మార్కాపురం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న దేవండ్ల సుజాత తాను కొన్ని బంగారు నగలు, రూ.లక్ష నగదు అదే ప్రాంతానికి చెందిన జె.కోటిరెడ్డి అనే యువకుడికి ఇచ్చినట్లు ఆరోపణలు చేసింది. అవి తీసుకొని.. అతను కనిపించకుండా పోయాడని మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ▶ 2లో

విద్యార్థుల విషయంలో

రాజకీయాలకు తావివ్వొద్దు

- విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి



సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-పంగులూరు

'విద్యార్థుల విషయంలో ఎక్కడా రాజకీయాలకు తావివ్వకూడదని, విద్యకు సంబంధించి ఎక్కడా రాజకీయ నాయకుల ఫొటోలు వేయవద్దని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారని, అందుకోసమే బ్యాగుల మీద కూడా నాయకుల ఫోటోలు, పార్టీ రంగు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. 'మీరు ఉండే హాస్టల్ ఎలా ఉంది, వార్డెన్ మిమ్మల్ని బాగా చూసుకుంటున్నారా.. భోజనం ఎలా ఉంటుంది.. రుచికరమైన భోజనం పెడుతున్నారా.. మీకు సమస్యలు ఏమన్నా ఉన్నాయా.?' అంటూ ముప్పవరంలోని శ్రీ పాటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ కుశల ప్రశ్నలు వేస్తూ పలకరించారు. పాఠశాలలో 110 విద్యార్థులకు ఆయన మంగళవారం నాడు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను ఐఎస్పి, నెట్ కేఫ్ సమకూర్చగా అసిస్ట్ సంస్థ సమన్వయంతో అందజేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు నియోజవర్గంలో 5,100 సైకిళ్లను అందజేశామని చెప్పారు. కాలేజీ విద్యార్థులు సైకిల్ లేక ఇబ్బంది పడుతున్నారని తెలిసి, సిఎస్ఆర్ నిధుల ద్వారా మంత్రి నారాయణ చేతుల మీదుగా 230 మంది విద్యార్థులకు సోమవారం అందజేశామని అన్నారు. పాఠశాల జాతీయ రహదారి పక్కనే ఉన్నందున విద్యార్థులు సైకిల్‌పై జాగ్రత్తగా ప్రయాణించాలని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేలకు పైచిలుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశామని అన్నారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారితో పాటు బెంగళూరు నుండి వచ్చే జాతీయ రహదారి కూడా పాఠశాల సమీపంలోకి ▶ 2లో

ప్రకాశం..భేష్.!

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తమ నీటి యాజమాన్య పద్ధతులు పాటించారు. ఇందులో భాగంగా ' రిడ్జ్ - టు - వ్యాలీ' విధానంలో వివిధ రకాలైన సహజ వనరుల యాజమాన్యపు పనులు చేపట్టారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం, భూగర్భ జలమట్టాలను పెంపొందించడంలో ఉత్తమ పద్ధతులను పాటించారు. ఖండిత కందకాల పనులు, చిన్న ఊట కుంటలు, పెద్ద ఊట కుంటలు, డగవుట్ పాండ్స్, అమత్ సరోవర్లు, పూడికతీత పనులు చేయడం ద్వారా దాదాపు 8.21 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేశారు. ఇందుకు 51 పనులకు దాదాపుగా రూ. 97 లక్షల నిధులు ఖర్చు చేశారు. ఈ పనులలో సాధించిన పురోగతిని తెలియజేసేలా డాక్యుమెంటేషన్ చేయించి గత ఏడాది అక్టోబర్‌లో కేంద్రానికి నామినేషన్ పంపించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెలలో కేంద్ర బందం వచ్చి క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించింది. భౌగోళికంగా భిన్న పరిస్థితులు ఉన్న ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి సంరక్షణ పనులలో సాధించిన పురోగతిని అభినందిస్తూ జిల్లాకు జాతీయస్థాయిలో రెండో ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించింది. మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబుకు ట్రోఫీ, ప్రశంసాపత్రం, రూ.1.5 లక్షల నగదును అందించింది. ఈ పథకం అమలులో జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా పనులను పర్యవేక్షించిన జిల్లా నీటియాజమాన్య ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్‌కుమార్‌ను కలెక్టర్ పి.రాజాబాబుతో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

విద్యార్థుల విషయంలో రాజకీయాలకు తావివ్వొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందన్నారు. అందువల్ల పాఠశాలకు తూర్పు వైపున ప్రహరీ గోడ నిర్మించాలని హెచ్ఎం పుచ్చకాయల ప్రసాద్ మంత్రిని కోరగా ఇది ప్రభుత్వ పాఠశాల కానందున ఈ విషయం పరిశీలిస్తామని అన్నారు. పాఠశాలకు ముందుగా అండర్ పాస్ నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలని ఉపాధ్యాయులు మంత్రిని కోరారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ విష్ణు ప్రియ, తహశీల్దారు సింగారావు, ఎంపిడిఒ స్వరూపరాణి, ఎంఇఒ వీరాంజనేయులు, గహ నిర్మాణ శాఖ ఎఇ కిషోర్ కుమార్, విద్యుత్ ఎఇ ఆంజనేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్ వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

సుజాత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చింది. తనకు న్యాయం చేయాలని వెంటతెచ్చుకున్న వాస్మాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడ ఉన్న స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు ఆమెను వెంటనే తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



లీక్ కారణంగా వృథాగా పోతున్న నీరు

పొంచి ఉన్న ప్రమాదం

గుండ్లకమ్మలోని చెక్‌డ్యామ్ అడుగు భాగంలో లీకులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో దశాబ్ధ కాలం క్రితం రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్‌కు ప్రమాదం పొంచివుంది. చెక్‌డ్యామ్ అడుగు భాగంలో లీకులు ఏర్పడ్డాయి. లీకులు అలాగే వదిలేస్తే చెక్‌డ్యామ్ కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది!

మార్కాపురం కరువు ప్రాంతం. అప్పుడప్పుడు భారీ వర్షాలు కురిసిన సమయాల్లో మాత్రమే ఇక్కడి గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో తాగునీటికి సైతం కటకటగా ఉండేది. భూగర్భ జలమట్టం పెంచేందుకు గుండ్లకమ్మ నదిలోని నీరు సముద్రంపాలు కాకుండా నిలువరించేందుకు అప్పటి నీటిపారుదల శాఖ రూ.9 కోట్లకు పైగా వెచ్చించి భారీ చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టింది. ఈ చెక్‌డ్యామ్‌లో నిలిచిన నీటితో సమీపంలోని పెద్దనాగులవరం గ్రామంతో పాటు మార్కాపురం పట్టణంలోనూ కొంత భాగం భూగర్భ జలమట్టం పెరిగింది. తాగునీటి సమస్యకు ఇబ్బంది లేకుండా ఉంది. చాలాకాలం నుంచి గుండ్లకమ్మ నదిలో ఉధృతంగా నీటి ప్రవాహం జరగలేదు. ఇటీవల మొంథా తుపాను కారణంగా గుండ్లకమ్మ నది పొంగిపోర్లింది. ఈ కారణంగా అప్పట్లో నిర్మించిన చెక్‌డ్యామ్ నీటితో నిండింది. చెక్‌డ్యామ్ పై నుంచి నేటికీ నీరు ప్రవహిస్తోంది. చెక్‌డ్యామ్ అడుగు భాగాన సిమెంటు ప్లాస్టింగ్ తొలగింది. అక్కడ సన్నపాటి లీకులు ఏర్పడ్డాయి. నీరు కొద్దికొద్దిగా కారుతోంది. ఆ లీకు చిన్నదే కదా అని వదిలేస్తే మాత్రం చెక్‌డ్యామ్‌కు భారీ ప్రమాదం ఏర్పడుతుంది. తక్షణమే మరమ్మతులు చేపడితే మాత్రం లీకులు నివారించే అవకాశం ఉంది. జాప్యం చేస్తే మాత్రం తగిన మూల్యం చెల్లించక తప్పదు.

డిఇఇ శ్రీనివాసరెడ్డి వివరణ

గుండ్లకమ్మ నదిలోని పెద్దనాగులవరం గ్రామ సమీపాన గల భారీ చెక్‌డ్యామ్ దెబ్బతిన్న విషయం తెలిసిందని మార్కాపురం జలవనరుల శాఖ డిఇఇ దేవళ్ల శ్రీనివాసరెడ్డి ప్రజాశక్తికి తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు వివరించినట్లు చెప్పారు. కాంట్రాక్టర్‌కు నేటికీ కొంత బిల్లు చెల్లించాల్సి ఉందన్నారు. అదే కాంట్రాక్టర్ ద్వారా లీకులు అరికట్టేలా చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. చెక్‌డ్యామ్‌కు నష్టం కలగకుండా తక్షణమే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రేమానందంపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మధ్యాహ్న భోజన కార్మికులపై ఆధారాలు లేని ఆరోపణలు చేసిన బేస్తవారిపేట ప్రేమానందంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మధాహ్న భోజన పథకం కార్మిక సంఘం (సీఐటీయు) బేస్తవారిపేట మండల కమిటీ అధ్యక్షుడు డి పాశ్చామియా, కార్యదర్శి ఎం మంజువాణి స్థానిక ఎంఈఓ-2 సీవీ రమణారెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం మత్తులో ప్రేమానందం ఈ నెల 17వ తేదీన సోమవారం మా పై దుష్ప్రచారం చేస్తూ అన్నంలో పసుపు కలిపి పులిహోర పెట్టారని ఆధారాలు లేని అబద్ధపు ఆరోపణలు చేస్తూ ప్రచారం చేస్తున్నాడన్నారు. ఆయన తమ పరువు మర్యాదలకు భంగం కలిగిస్తూ మా మనోభావాలు దెబ్బ తీస్తున్నాడని, సమాజంలో మమ్మలను దొంగల్లాగా చిత్రీకరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజాలను నిర్ధారించి, తమపై అసత్య ప్రచారం చేసిన ప్రేమానందంపై శాఖాపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు షేక్ అన్వర్‌పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా ..

పలువురికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటనలో పలువురు భక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం ఏపీ 39 డబ్ల్యూ బి3003 అనే నెంబర్ గల బొలెరో వాహనం విజయవాడ నుంచి భక్తులతో శ్రీశైలం వెళుతోంది. దోర్నాల నుంచి నాలుగు కిలోమీటర్ల సమీపంలోని పెద్ద మూల టర్నింగ్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో భక్తులు 8 మందికి గాయాలయ్యాయి వీరిని 108 ద్వారా దోర్నాల వైద్యశాలకు తరలించారు. బోల్తా పడిన వాహనాన్ని వెంటనే పక్కకు తీశారు.

ప్రజాశక్తి
3
బుధవారం 19 నవంబర్ 2025

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలు పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎస్.రామారావు అధ్యక్షతన మంగళవారం టంగుటూరు పొగాకు వేలం కేంద్రం పరిధిలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 2025-26 పంటకాలానికి పొగాకు సాగు విస్తీర్ణం కొంత తగ్గించుకొని ప్రత్యామ్నాయ పంటలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రీజనల్ మేనేజర్ ఎస్.రామారావు సూచించారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.ప్రసాద్ బాబు, డాక్టర్ ఐ.వెంకటేష్ మాట్లాడుతూ పొగాకు పంటకు ఉన్న ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, పెసర, మొక్కజొన్న పంటలు సాగు చేయాలన్నారు. టంగుటూరు మండల వ్యవసాయ అధికారి డి.యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు బ్లాక్ బర్లీ పొగాకు పంటసాగు చేయవద్దన్నారు. టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం పొగాకు పంట నియంత్రణ తప్పనిసరిగా పాటించాలన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ మేనేజరు రామారావు

పొగాకు బేళ్ల అమ్మకాలు

టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 219 బేళ్లు తిరస్కరణకు గురయినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. బోర్డు పరిధిలోని జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 843 బేళ్లను అమ్మకానికి తీసుకు వచ్చారు. అందులో 624 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 207 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.310, కిలో పొగాకు అత్యల్ప ధర రూ.50, సరాసరి ధర రూ.153.14 పైసలు పలికింది. పొగాకు వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి: కొండపి పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1394 పొగాకు బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 1081 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా మిగిలిన 311 బేళ్లు వివిద కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.310, అత్యల్ప ధర కిలో రూ.50, సరాసరి ధర కిలో రూ.146.47 పలికిందని వేలం నిర్వహణాదికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సర్పంచ్ శైలజ

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-మద్దిపాడు

విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం చాలా బాగుందని సర్పంచ్ కాకి శైలజ అన్నారు. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ బాగుందని విద్యార్థులకు నిర్వాహకులు బాగా వండి పెడుతున్నారని విద్యార్థులే స్వయంగా చెబుతున్నట్లు తెలిపారు.రుచికరంగా భోజనం ఉండేటట్లు చూసుకోవాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. తమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులందరూ 100 శాతం తింటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి తెలిపారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వంటకు అవసరమయ్యే చిన్నపాటి వస్తువులు లేవని నిర్వాహకులు చెప్పడంతో వెంటనే సర్పంచ్ స్పందించి మీకు కావాల్సిన వస్తువులు తెచ్చుకోవాలని అందుకు అవసరమయ్యే డబ్బులను తాను చెల్లిస్తానని తెలిపారు. మధ్యాహ్న భోజనం పరిశీలించిన వారిలో పంచాయతీ కార్యదర్శి డేవిడ్ ఉన్నారు.

వంగవీటి రంగా విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-దర్శి

పేద ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న నేత వంగవీటి రంగా అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపు శెట్టి పాపారావు అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద వంగవీటి రంగా, దర్శి మాజీ సర్పంచ్ కనకం వెంకయ్య విగ్రహాలకు గొట్టిపాటి లక్ష్మి, యువ నాయకుడు కడియాల లలిత సాగర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సమన్యాయం కోసం నిరంతరం పాటుపడిన వంగవీటి రంగా అని కొనియాడారు. అదేవిధంగా 30 సంవత్సరాలుగా దర్శి పంచాయతీకి సర్పంచిగా కొనసాగిన కనకం వెంకయ్య సేవలు మరువలేనివని దర్శి మాజీ శాసనసభ్యులు పాపారావు అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారశెట్టి పిచ్చయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి సహకార సంఘం అధ్యక్షుడు కలవకలను చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్న, కౌన్సిలర్ కనకం మల్లేశ్వరి, శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు శోభారాణి, కర్ణ శీను, యాదగిరి వాసు, పి.వెంకట్రామయ్య, టిడిపి, కాపు నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

కుల గణన చేపట్టాలి

ప్రజాశక్తి-కనిగిరి

జనగణనలో కుల గణన జరగాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ యాసిన్ డిమాండ్ చేశారు. దళిత, గిరిజన, మైనార్టీ పై జరుగుతున్న దాడులకు నిరసనగా సిపిఐ జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు కనిగిరి ఆర్డిఓ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన ,ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్త ఆందోళనలు చేయాలని కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏనుబరి రవీంద్రబాబు, సయ్యద్ మౌలాలి, పోతుల ప్రభాకర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, సిఎస్పురం మండలం కార్యదర్శి ఎస్ కే వై పెద్ద మస్తాన్, వజ్రాల సుబ్బారావు, గుజ్జల బాలిరెడ్డి, మండల సాయి కార్యదర్శి గులాం హుస్సేన్, కాసిం పీరా, పుట్ట సుబ్బారావు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఇఫ్రాజ్, సూరిబాబు, పాలపర్తి మస్తాన్రావు, ఎస్ కే వై మౌలాలి, ఎస్ రమేష్, బషీరా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ యాసిన్

చదువుతో పాటు ఆటలలో కూడా రాణించాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ఐదవ రోజు కనిగిరి పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన డ్రాయింగ్ పోటీలు గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు దేశం పార్టీ కనిగిరి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థినీ విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అని తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలియజేశారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారధ్యంలో విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి మేమందరం కృషి చేస్తామని అన్నారు. కనిగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్శి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చిత్రలేఖనం, క్విజ్ పోటీలు విద్యార్థులకు మంగళవారం గ్రంథపాలకురాలు వి.విజయకుమారి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు లావణ్య, వెంకటేశ్వర్లు వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి వి.విజయ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

టంగుటూరు: విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత పదవులు అలంకరించాలని ప్రభుత్వ జిజెసీ జూనియర్ కాలేజి కెమిస్ట్రి లెక్చరర్ సుకుమార్ తెలిపారు. టంగుటూరులోని శాఖా గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా దేశభక్తి భక్తి గేయాలు పోటీలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథపాలకుడు వర్ధనరాజు తెలిపారు.


మాట్లాడుతున్న షేక్ ఫిరోజ్

వాగులో వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని చిన్నారికట్ల విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని ఎర్రవాగులో వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం పామూరు అంకాలమ్మ వీధికి చెందిన సోమిశెట్టి శ్రీరాములుదిగా గుర్తించారు. ఈయనకు భార్య రవణమ్మ, కుమారుడు ఉన్నారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేక గతంలో నెల్లూరు హాస్పటల్లో చికిత్స పొందారని బంధువులు తెలిపారు. అయితే సంవత్సరం నుంచి శ్రీరాములు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకొని వుండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. కొనకనమిట్ల ఎస్ఐ బి.శ్రీకాంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీరాములు మృతదేహం

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న లారీ

డ్రైవర్‌ను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-టంగుటూరు

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలు కాగా సకాలంలో పోలీసులు స్పందించి ప్రాణాలు కాపాడిన సంఘటన టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ వి.నాగమల్లీశ్వరరావు కథనం మేరకు.. తెలంగాణలోని పాల్వంచ నుంచి ఆత్మకూరు వైపు జామాయిల్ లోడుతో వెళ్తున్న వాహనం డ్రైవర్ సాయి టంగుటూరు టోల్ ప్లాజాకు సమీపంలో వచ్చే సరికి తన ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సాయి బండిలో ఇరుక్కు పోయారు. ప్రమాదం గురించి తెలుసుకున్న టంగుటూరు పోలీసులు, హైవే పోలీసులు ఎస్ఐ నాగమల్లీశ్వరరావు వెంటనే అక్కడకు చేరి డ్రైవర్ సాయిని ఇనుప చువ్వలు, తాడులు సహాయంతో బయటికి తీశారు. ఈ ప్రమాదంలో సాయి తలకి, కాళ్ళకి గాయాలయ్యాయి. అదే వాహనంలో ప్రయాణిస్తున్న అబ్దుల్లాకి స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. టంగుటూరు యస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన డ్రైవర్ సాయి

కమ్యూనిస్టు నాయకురాలు రాములమ్మ మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల పంచాయతీ పుట్లూరీ వారిపల్లి (ఎర్రగడ్డ) గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకురాలు సిగినం రాములమ్మ (95) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈమెభర్త వెంకటయ్య అనారోగ్యంతో గతంలో మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, తొమ్మిది మంది కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త సిగినం వెంకటయ్య గుజ్జుల ఎలమందారెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి, పత్రా ఐజాక్ సీనియర్ కమ్యూనిస్టులతో కలిసి గతంలోఅనేక పోరాటాలు, ఉద్యమాలలో పాల్గొన్నారు. రాములమ్మ వెంకటయ్యకు మద్దతుగా ఉంటూ పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. రాములమ్మ పెద్దకుమారుడు సిగినం వెంకటేశ్వర్లు ప్రజానాట్యమండలి కళాకారుడు. రాములమ్మ మృతదేహాన్ని సర్పంచ్ లక్ష్మీ తిరుపతమ్మ, పొదిలి ఏరియా సిపిఎం పార్టీ కన్వీనర్ పి.బాల నరసయ్య, గరిమెనపెంట ఎంపీటీసీ కరాటి నాగలక్ష్మి, రామకోటేశ్వరరావు, చింతగుంట మాజీ సర్పంచి రాగి గురవయ్య, సిపిఐ నాయకులు సిద్దయ్య, పాత్రికేయులు పత్రా పిచ్చయ్య, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.


రాములమ్మ (ఫైల్)

21న 'ఒయాసిస్' ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న అద్దంకిలోని షిఫా హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ దీపికా బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత అపాయింట్‌మెంట్, ఉచిత స్కాన్, ఉచిత కౌన్సెలింగ్, మందులపై తగ్గింపు ఉంటుందన్నారు. స్పాట్ ఐవిఎఫ్ బుకింగ్‌పై రూ.20 వేల తగ్గింపు, వీర్య విశ్లేషణపై 50 శాతం తగ్గింపు, ఉచిత ఏఎంహెచ్ పరీక్ష ఉంటుందన్నారు. ఉచిత అపాయింట్‌మెంట్ కోసం సెల్ నెంబర్ 91542 66854ను సంప్రదించాలని కోరారు.



ఇంటి పన్ను క్యూ ఆర్ బోర్డు విడుదల చేస్తున్న దృశ్యం

ఇంటి పన్ను క్యూఆర్ కోడ్ విడుదల

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లను ఆన్లైన్ ద్వారా చెల్లింపులు చేయాలనే ప్రభుత్వ ఆదేశంతో క్యూ ఆర్ కోడ్‌ను అధికారులు మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని ముప్పవరం పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ స్వరూప రాణి క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్ పే ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి తమ పంచాయతీ, అసెస్మెంట్ నెంబర్‌తో నిమిషాల వ్యవధిలో ఇంటి పన్ను చెల్లించవచ్చని అన్నారు. మండలంలోని ప్రజలు ఇంటి పన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సుమంత్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

రోడ్డును తక్షణమే నిర్మించాలి

మాజీ ఎంఎల్ఎ, డిసిసి అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి - బాపట్ల

మొంథా తుఫాన్ ప్రభావంతో చీరాల నుండి సముద్ర తీరానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీటి కోతకు గురై దెబ్బతిన్నదని, వెంటనే పునర్ నిర్మించాలని మాజీ శాసన సభ్యులు, డిసిసి అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్ కలెక్టర్ వినోద్ కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. చీరాల నుండి బీచ్ వైపుకు వెళ్లే రహదారి వంతెనలు కూలిపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుఫాను పోయి 20 రోజులు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితి మత్స్యకారుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తోందని అన్నారు. రహదారి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో వ్యాపారాలు సజావుగా సాగేందుకు, మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడేందుకు అధికారులు అత్యవసర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



అవగాహన కల్పిస్తున్న పి మరియజ్యోతి

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

కర్మాగారాల్లో పనిచేసే మహిళలు, విద్యా సంస్థల్లో చదువుకునే బాలికలు లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్జీఒ కో ఆర్డినేటర్ పి మరియా జ్యోతి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. లైంగిక వేధింపులు ఎదుర్కొనేందుకు మానసికంగా, శారీరకంగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహ నిరోధక చట్టం 2006 గురించి వివరించారు. ఎవరికైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు 100 లేదా స్కోప్ సంస్థకు తెలపాలని అన్నారు.

పంగులూరులో డిఎపి కొరత

సమాధానం చెప్పలేని సొసైటీ అధికారులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలో ఎరువులు కొరత ఏర్పడింది. పంటల సాగు ప్రారంభంలోనే డిఎపి కొరత ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబి సీజన్లో రైతులు పలు రకాల పంటల సాగుకు ఉపక్రమించారు. రబి సీజన్లో మండలంలో 4,912 హెక్టర్లలో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారు. వాటిలో వరి 450 హెక్టార్లు, మొక్కజొన్న 2వేల హెక్టార్లు, మిర్చి 400 హెక్టార్లు, శనగ 260 హెక్టార్ల తోపాటు పత్తి, కూరగా యల వంటి పంటలు సాగు చేస్తారు. అయితే ఈ సీజన్లో ఎరువులు ఎంతో అవసరం ఉంది. ఇప్పుడు ఎరువులు లేకపోతే రైతులు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కొండ మందులూరు సొసైటీకి ప్రస్తుతం 40 టన్నుల డీఏపీ, 32 టన్నులు యూరియా వచ్చింది. ఈ సొసైటీ పరిధిలో రామకూరు, కొండ మంజులూరు, కళ్ళంవారిపాలెం, భగవాన్ రాజుపాలెం గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులకు ఈ ఎరువులు సరిపోలేదు. ఇంకా 50 టన్నులు డీఏపీ కావాలని రైతుల కోరుతున్నారు. కోటపాడు సొసైటీకి డీఏపీ 300 బస్తాలు ఇచ్చారు. కొండమూరు, కోటపాడు గ్రామాల పరిధిలోని ఈ సొసైటీకి మరో 500 బస్తాల డిఏపి అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో రైతులు



ఆర్ఎస్‌కె నుండి ఎరువు తీసుకెళుతున్న రైతు (ఫైల్)

మొక్కజొన్న, శనగ, వరి పంటలు సాగు చేస్తుంటారు. అందువలన మూడు రోజుల్లో ఎరువులు లేకపోతే ఇబ్బంది పడతామని రైతులు చెబుతున్నారు. జాగర్లమూడి వారిపాలెం సొసైటీ పరిధిలో డిఎపి, యూరియా కొరత ఉందని, రైతులకు అవసరమైనంత ఎరువులు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎఒ డి సుబ్బారెడ్డిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా ఈపాటికి మండలంలో 450 టన్నుల డిఏపి, 7 టన్నుల యూరియా పంపిణీ చేశామని, తెలిపారు. ఇంకా డిఎపి, యూరియా అవసరం చాలా ఉందని తెలిపారు. ఇందు కోసం 350 టన్నులు కావాలని అధికారులకు తెలిపామని, మరో రెండు రోజుల్లో స్టాకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రైతులు ఎరువుల విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కొల్లూరు సెంటర్లోని ఆర్ఎస్‌కె వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం ప్రారంభించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025 – 26 జిల్లా సివిల్ సప్లై, జిడిసి ఎంఎస్ ఆధ్వర్యంలో రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరిగే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్‌పి ధరలకు కొనుగోలు జరగాలని చెప్పారు. దళారీ వ్యవస్థ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాల దివాలా దీవించారని అన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలన్నీ వరుసగా అమలు పరుస్తుందమని అన్నారు. అన్నదాత సుఖీభవ క్రింద రైతు ఖాతాల్లో రూ.7 వేలు జమ చేయబోతున్నామని అన్నారు.



ధాన్యం కేంద్రాలు ప్రారంభిస్తున్న ఆనందబాబు

జాయింట్ కలెక్టర్ భావన మాట్లాడుతూ గతేడాది 97వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే ఈ ఏడాది 2లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయబడతాయని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి, జిడిసిఎంఎస్ ఛైర్మన్ హరిబాబు, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

దెబ్బతిన్న కౌలు రైతుల పంటలు నమోదు చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

చూండురు మండలంలోని వలివేరు గ్రామంలో మొంథా తూఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వ్యవసాయ సిబ్బంది కౌలు రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. తుఫానుకు దెబ్బతిన్న పంటలను ఎఒ నమోదు చేయక పోవడంతో ఈనెల 5న తహశీల్దారుకు గ్రామంలోని కౌలు రైతుల ఫిర్యాదులు అర్జీరూపాంలో అందజేశారు. దీంతో తహశీల్దారు ఇచ్చిన అర్జీలు వ్యవసాయ అధికారులకు బదిలీ చేశారు. అర్జీలపై విచారణ చేయకుండా నిర్లక్ష్యంగా పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆ సమస్యపై జిల్లా, డివిజనల్ అధికారులకు నష్టపోయిన కౌలు రైతు సంఘం ప్రతినిధులు వాట్సాప్ ఫోన్ కాల్



దెబ్బ తిన్న పంటలు పరిశీలిస్తున్న అధికారులు

ద్వారా సమాచారం అందించారు. ఈ విషయమై కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు కౌలు రైతుల సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై అధికారులు సిబ్బందితో పరిశీలించారు.

ఇప్పటికీ వర్షపు నీళ్లలోనే జూట్ పంట

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలోని యనమదల గ్రామానికి చెందిన వెంకటయ్య అనే కౌలు రైతు తాను 4ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశానని,.అన్ని ఖర్చులు కలుపుకొని ఎకరాకు సుమారు రూ.35వేల నుండి రూ.38వేల వరకు ఖర్చులు కలుపుకొని పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. కౌలు ఎకరాకు రూ.10వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ.40వేలైనట్లు తెలిపారు. అదీ బంధువులు కాబట్టి ఎకరం రూ.10వేలకు ఇచ్చారని తెలిపారు. అక్టోబర్ 28, 29 తేదీల్లో వచ్చిన మోంథా తుఫాన్ వల్ల తాను సాగు చేసిన జూట్ చేనుకు దగ్గరలోని వాగు పొంగి



వర్షపు నీళ్ళలో దెబ్బతిన్న జూట్ పంట

ప్రవహించి తన పంటను ముంచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం తరువాత నీళ్ళు చేలోనే నిలిచి ఉన్నాయని, బయటకు పంపటానికి అవకాశం లేక అలానే ఉన్నాయని తెలిపారు. జూట్ పంట సాగుచేసి నష్ట పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న గడ్డం శేఖర్ బాబు

పుస్తకాలు కొని చదవటం ఉత్తమ అలవాటు

ప్రజాశక్తి - బాపట్ల

పుస్తకాలు కొని చదవడం ఉత్తమ విద్యార్థి లక్షణమని వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి, ఎపి ప్రాసెసింగ్ సొసైటీ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం ముఖ్య కార్య నిర్వహణాధికారి గడ్డం శేఖర్ బాబు అన్నారు. వ్యవసాయ కళాశాల్లో జరుగుతున్న దీక్షారంభ్ 8వ రోజు ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వ్యవసాయ సంబంధిత గ్రంథాలతోపాటు ఇతర పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని అన్నారు. ఇది వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది అవుతుందని అన్నారు. వ్యవసాయ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. కేవలం డిగ్రీతో సరిపెట్టుకోకుండా పిజి పిహెచ్‌డిలు చేయాలని అన్నారు. వాటి ద్వారా పొందగలిగే ఉన్నత ఉద్యోగాల లక్ష్యాన్ని నూతన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి, లాల్ అహమద్ మొహమ్మద్, ఎం సంధ్య, కె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ జమ

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలో 649 మంది రైతు కుటుంబాలకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు ఎన్ మేరమ్మ తెలిపారు. ఒక్కొక్క రైతుకు రూ.5 వేల చొప్పున రూ.3.02కోట్లు, పీఎం కిసాన్ కింద ఒక్కొక్క రైతుకు రూ.2వేల చొప్పున రూ.2.25 కోట్లు రైతుల ఖాతాలో రూ.4.27 కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు.

వేమూరు : మండలంలో అన్నదాత సుఖీభవ క్రింద 5790 మంది రైతులకు రూ.2.90 కోట్లు, పిఎం కిసాన్ ద్వారా 5027 మంది రైతులకు రూ.కోటి చొప్పున విడుదల కానున్నట్లు ఎఒ గల్లా ప్రేమ సాగర్ తెలిపారు.

పంగులూరు : అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలో 7,267 మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతుంని ఎఒ డి సుబ్బారెడ్డి తెలిపారు. వీరికి రూ.3.63 కోట్లు జమవుతాయని అన్నారు. పీఎం కిసాన్ యోజన పథకం కింద 6,682 మంది రైతులకు రూ.1.34 కోట్లు జమ అవుతాయని తెలిపారు. రూ.4.97 కోట్లు మండలంలోని రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు.

బల్లికురవ : రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందని ఎఒ బి ఎల్లమందరెడ్డి తెలిపారు. మండలంలో 9150 మంది లబ్ధిదారులకు రూ.4.58 కోట్లు, పిఎం కిసాన్ పథకం ద్వారా 8367 మంది లబ్ధిదారులకు రూ.1.6 కోట్లు కలిపి రూ.6.25 కోట్లు లబ్ధి చేకూర్తుందని తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఎస్ఎ ఎఎంఒ ఖాశిం

ఆటస్థలాల బిల్స్ అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

సమగ్ర శిక్ష ఎఎంఒ (ఉర్దూ) షేక్ కాశీం మండలంలోని పిఎం పాఠశాలలను, తిమ్మాపాయిపాలెం జడ్పీహెచ్ఎస్, కాకానిపాలెం ఎంపీపీఎస్, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న మైదానం, ఆపార్ ఐడీ, ఎస్ఆర్‌కెవిఎం బయోమెట్రిక్ అతంటికేషన్ గురించి హెచ్ఎంతో చర్చించారు. హెచ్ఎంలకు కొన్ని సూచనలు ఇచ్చారు. మండల విద్యా వనరుల కేంద్రం నందు సిఆర్పిలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రతి పాఠశాల్లో ఆపార్ పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. పాఠశాల మైదానం బిల్స్ అన్నీ బుధవారంలోపు అప్లోడ్ చేయాలని అన్నారు.

ప్రజాశక్తి

బుధవారం 19 నవంబర్ 2025

సామాజిక న్యాయానికి కులగణనే మార్గం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

దేశంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం పునరుద్ధరణకు కులగణన తప్పనిసరి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ వద్ద సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నగర కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో అజయ్‌కుమార్ మాట్లాడారు. కులగణన ఆధారంగా శాసనసభలు, స్థానిక సంస్థలలో అణగారిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో గాడ్సే సిద్ధాంతాన్ని అనుసరించే మతోన్మాద పాలన కొనసాగుతుందన్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మతోన్మాద పాలన బలపడుతుండడంతో రాజ్యాంగ విలువలు, లౌకిక వ్యవస్థ, ప్రజాస్వామ్య హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ఎస్సీలు, ఎస్టీలపై నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించిన 2023 గణాంకాలు దేశంలో అణచివేత ఎంత పెరిగిందో చూపిస్తున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయ్‌పై ఇటీవల జరిగిన మతోన్మాద దాడి ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక అని వ్యాఖ్యానించారు. కార్పొరేట్ దోపిడీకి సహకరిస్తూ గిరిజనుల భూములు, సహజవనరులను కొల్లగొట్టే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ధ్వజమెత్తారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 143కు పైగా వెనుకబడిన కులాలు ఉండగా, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేలాది బీసీ నాయకులు పదవులు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టి, అదే ఆధారంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, లౌకిక ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యత అని తెలిపారు. 2026 జనవరి నుంచి నిర్వహిస్తున్న జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ ఒబులేసుకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు బేగ్, బీసీ సంఘాల నేతలు మస్తాన్‌రావు, సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళి, సిపిఐ నాయకులు ముత్తన అంజయ్య, ఎస్‌డి. సలార్, నూనె మోహనరావు, ఉప్పుటూరి ప్రకాశ్‌రావు, ఏఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్

పారిశుధ్య నివారణపై చైతన్యం పెంచాలి : డిపిఒ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గ్రామ స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా జరగాలంటే ప్రజల్లో చైతన్యం అత్యవసరమని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఒంగోలు మండలం బొద్దులూరివారిపాలెం గ్రామపంచాయతీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి భద్రత, ప్రజల్లో స్వచ్ఛత అవగాహనపై పలు కీలక సూచనలు చేశారు. క్లాప్ మిత్రులు ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిఆర్‌పి బందం విస్తత ప్రచారంతో గ్రామంలోని ప్రతి వ్యక్తికి స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యత గురించి అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో నమోదు అయ్యే ఐవిఆర్ఎస్ కాల్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజశేఖర్ రావు, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి కె. హరిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలస కుటుంబాల పిల్లలకు సీజనల్ హాస్టళ్లు

పజాశక్తి- ఒంగోలు సిటీ

వలస కుటుంబాల పిల్లలు చదువు నుంచి దూరం కాకుండా చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు డిఇఒ కిరణ్ కుమార్ తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి మొత్తం 7 సీజనల్ హాస్టళ్లు ప్రారంభించడానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు అనుమతి ఇచ్చినట్లు డిఇఒ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా నిర్వహించే ఈ హాస్టళ్లలో మొత్తం 338 మంది పిల్లలకు వసతి, భోజనం, విద్యా కార్యక్రమాలు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు సిఎస్ పురం మండలం పెదరాజుపాలెంలో (44 మంది), గుంతచెన్నంపల్లిలో (50 మంది), చీమకుర్తి మండలం పి. నాయుడుపాలెంలో (44 మంది), గిద్దలూరు మండలం త్రిపురవరంలో (50మంది), కొంగలవీడులో (50మంది), తర్లుపాడు మండలం నాగెళ్ళముడుపులో (100 మంది)కి వసతి ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ అవకాశాన్ని వలసదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టళ్ల నిర్వహణకు స్వచ్ఛంధ సంస్థలు (ఎన్‌జిఒ) మరియు స్వయం సహాయక సంఘాలు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ తెలిపారు. ఈ నెల 25 వరకు దరఖాస్తులు అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సమగ్ర శిక్ష, ఒంగోలు కార్యాలయానికి పంపాలని తెలిపారు. వివరాలకు ఆల్టర్ నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ 9505032613 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ పూర్తిచేయండి : డిఆర్ఒ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా పెండింగ్‌లోని క్లెయిమ్ ఫారం 6, 7, 8 పై వారం రోజులలో విచారణ పూర్తిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఒంగోలు నియోజక వర్గానికి సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన ఓబులేసు మాటాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా 2002 సంవత్సరం ఓటరు లిస్టు లోని పేర్లు, ప్రస్తుతం 2025 సంవత్సరం ఓటరు జాబితాలోని పేర్లకు మ్యాపింగ్ ప్రక్రియ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇఆర్ఒ మరియు ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మి ప్రసన్న, ఒంగోలు, కొత్తపట్నం తహశీల్దార్లు పి.మధుసూధనరావు, శాంతి, ఎఇఆర్ఒలు రామానాయుడు, సలోమి, భూపాల్ రెడ్డి, రాజశేఖర్‌రావు, బాబూరావు, సుధాకర్ రావు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబిఎ) 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డిఎ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం వర్చువల్ విధానంలో నిర్వహించారు. పంజాబ్‌లోని అమత్సర్ నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ శాఖలు అనుసంధానమయ్యాయి. స్థానికంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ శాఖ, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు, ఈగిల్ టీమ్ సిబ్బంది, విశ్రాంత ఎస్‌పి బల్లి రవి చందర్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచే బాధ్యతను సమాజంలోని అందరూ తీసుకోవాల్సిన అవసరాన్ని వక్తలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల ప్రమాదాలు, శారీరక, మానసిక దుష్ప్రభావాలపై నిపుణులైన రిసోర్స్ పర్సన్‌తో నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్ విద్యార్థుల్లో చైతన్యం నింపింది. ఈ కార్యక్రమంలో 1,200 మంది విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విద్యార్థులకు ఐక్యత, సమానత్వంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం మెరుగుపడాలంటే తప్పనిసరిగా క్రీడలు నిర్వహిస్తూ తరగతి గదులలో సమానత్వం పాటించాలన్నారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు, సమాజ నిర్మాణం తరగతి గదులలోనే ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థుల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. భేదాభిప్రాయాలకు తావులేకుండా విద్యార్థులతో ఉపాధ్యాయులు చక్కగా ప్రవర్తించాలన్నారు. 6,7 శాతం విద్యాసంస్థల్లోనే ఆత్మహత్యల కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను పూర్తిగా అరికట్టాలన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఫిర్యాదుల బాక్స్ విధిగా ఉంచాలన్నారు. ప్రతి నెలా రెండు, నాలుగో సోమవారాల్లో అధికారులు ఫిర్యాదు బాక్సులను తెరిచి చూడాలన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే వాటిపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు, ఆత్మహత్య ఆలోచన వచ్చే విద్యార్థుల కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 14416 టెలిమానస్ ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు ఎవరైనా ఈ నెంబర్ కు కాల్ చేయవచ్చన్నారు. 24 గంటల పాటు టెలి మానస్‌పనిచేస్తుందన్నారు. జిల్లాలోని 19 డిగ్రీ కళాశాలలు, 184 జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలలోనూ వీటిని నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. డిసెంబర్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కర్మ యోగి ద్వారా ఆన్‌లైన్ తరగతులు వినేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ జుబేర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల ఎస్‌పి బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థల సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాలు, బడ్డీకొట్లలో మంగళవారం విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో గంజాయి, సిగరెట్లు, పాన్, గుట్కా వంటి ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదనే నిబంధన ఉందన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాలను సంబంధిత పోలీసు అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పొగాకు ఉత్పత్తులు, పాన్, గుట్కా వంటి వాటిని విక్రయిస్తున్న 80 మందిపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గత 5 నెలల నుంచి 1,558 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుపై తల్లిదండ్రులు అనేక ఆశలు పెట్టుకుంటారని, ఆ లక్ష్య సాధన కోసం కృషి చేసే క్రమంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందన్నారు. యువత భవిష్యత్తును అంధకారం లోకి నెట్టే గంజాయి లాంటి మత్తుపదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్నవారు లేదా అక్రమంగా వాటిని విక్రయిస్తున్నవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు లేని ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే వెంటనే సంబంధిత పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నంబర్లు 1972,112లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసు అధికారి

దేవుని మన్యంలో చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - పంగులూరు

సుప్రీంకోర్టు విచారణలో ఉన్న దేవుని మాన్యం వివాదం కేసు పరిష్కారం కాకుండానే ఆ భూమిని కొన్న వాళ్లు చెట్లు తొలగించటం విమర్శలకు తావిస్తోంది. కేసు విషయమై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వక ముందే ఒక వర్గం చెట్లను తొలగించే ప్రక్రియకు పూనుకోవడం సరైంది కాదని పలువురు అంటున్నారు. మండలంలోని కొండమూరులోని మల్లేశ్వర స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల దేవాలయాలకు సంబంధించి జాతీయ రహదారి ప్రక్కన జాగర్లమూడి వారిపాలెం దళిత కాలనీ ఉత్తరాన 15 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని అప్పట్లో భజంత్రీలకు ఇచ్చారు. కొంత కాలం తర్వాత ఆ భూమిని భజంత్రీలు వేరొకరికి అమ్మారు. ఇప్పటికీ ఆ భూమి మూడు చేతులు మారింది. ఆ భూమిలో కొంత భాగం జాతీయ రహదారి విస్తరణలో పోగ కొంత ఆక్రమణలకు గురైంది. ఇప్పుడు 11.50 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. ఇందులో మల్లేశ్వర స్వామి దేవాలయం క్రింద 10.40 ఎకరాలు, రాజ్యలక్ష్మి అమ్మవారు దేవాలయం క్రింద 1.10 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఈ భూమి విలువ ఎకరా రూ.కోటి ఉంటుందని అంచనా. ఇంత విలువైన భూమిని దేవాలయం ఉంటుందే ఉంచాలని, బయట వ్యక్తులకు అమ్మటం సరైంది కాదని గ్రామానికి చెందిన వాసిపల్లి సుబ్బారెడ్డి 2006లో లోకయుక్తలో కేసు వేశారు. ఈ కేసు ఆర్డీఓ విచారణ చేయాలని 2011లో లోకయుక్త ఆదేశించింది. ఈ భూమిని వెంటనే స్వాధీనం చేసుకొని దేవాలయానికి అప్పగించాలని 2019 నవంబర్‌లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఐనా ఈ భూమిని స్వాధీనం చేసుకోవడానికి దేవాదాయ శాఖ అధికారులు ఎవరూ సాహసం చేయలేక పోయారు. అప్పటి నుండి ఆ భూమిలో ముళ్ళ చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తుంది. అయితే ఆ భూమిలో చెట్లను భజంత్రీలు దగ్గర నుండి భూమిని కొనుగోలు చేసిన వారు ప్రొక్లైన్ తీసుకొచ్చి మంగళవారం చెట్లను తొలగించే పనికి శ్రీకారం చుట్టారు. ఈ విషయమై ఆ దేవాలయాల కార్యనిర్వహణాధికారి వాసును 'ప్రజాశక్తి' ప్రశ్నించగా 2019లోనే హైకోర్టు ఆదేశాలను అనుసరించి భూమిని స్వాధీనం చేసుకోవాల్సిన అధికారులు ఎందువలనో స్వాధీనం చేసుకోలేదని, ఆ భూమి నిరుపయోగంగా ఇప్పటివరకు ఉండిపోయిందని చెప్పారు. తర్వాత కాలంలో ఆ భూమిని కొనుగోలు చేసిన వారు కేసును సుప్రీంకోర్టుకు వేశారని,, ఈ కేసు విషయమై ఇప్పటివరకు ఎలాంటి తీర్పు ఇవ్వలేదని చెప్పారు. ఏ తీర్పు రాకుండానే ఆ భూమిలో చెట్లను తొలగించటం సరైనది కాదని, తాను వారితో మాట్లాడానని వాసు చెప్పారు. హైకోర్టు తీర్పు ప్రకారం అధికారులు స్వాధీన పర్చుకోలేదు కాబట్టి, భూమి తమ స్వాధీనంలోనే ఉందని వాళ్ళు చెప్పారని, ఆ భూమిని ఉపయోగించుకునేందుకు చెట్లు తొలగిస్తున్నామని తనతో చెప్పినట్లు ఇఒ వాసు తెలిపారు. ఈ విషయమై తాము లీగల్ ఒపీనియన్ తీసుకొని ముందుకు వెళతామని తెలిపారు.


దేవుడి మన్యంలో చెట్లు తొలగిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న కొణిదల మనోరంజన్ బాబు

'అక్షర ఆంధ్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పంగులూరు

అనేక కారణాలతో పాఠశాలకు వెళ్లే వయసులో చదువుకు నోచుకోక చదువుకునే వయసు దాటిన వయోజనులకు ఉపయోగపడేలా చదవటం, రాయడం నేర్పించడం వంటి అవకాశాలు అందజేయడం కోసం వయోజన విద్య కృషి చేస్తుందని వయోజన విద్య పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డిఆర్డిఎ సీసీలు, విఒఎలు, వాలంటీర్ టీచర్లకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020కి నిర్దేశించిన ప్రకారం చదువు రాని వారికి ప్రాథమిక అక్షరాస్యత తోపాటు 21వ శతాబ్దపు సవాళ్లన ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలు అందజేయ డానికి భారత ప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ పథకం కింద రాష్ట్రంలో 2029 కల్లా 100శాతం అక్షరాశ్యత సాధించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మండలంలో 15ఏళ్ల దాటిన చదువురాని వయోజనులు మండలంలో 2460 మందిని గుర్తించామని చెప్పారు. వారి వివరాలు నమోదు చేసుకొని వారికి చదువు చెప్పేందుకు ప్రతి 10మందికి ఒక వాలంటీర్ చొప్పున 246 మంది వాలంటీర్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎన్జీఒలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, పి4 మార్గదర్శకులు, ఇతర పెద్దల సహాయ సహకారాన్ని అందించాలని కోరారు. మొదటి విడత ఉల్లాస్‌లో చదువుకొని పరీక్ష రాసి వృత్తి లేని వారికి సర్టిఫికెట్లను అందజేశారు. నూరు శాతం అక్షరాస్యత సాధించడానికి కృషి చేయాలని ఎంపిడిఒ స్వరూపరాణి కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ వీరాంజనేయులు, సిడిపిఒ ఎపిఎం ఎలిజబెత్ రాణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యులు కావూరు రఘు చెంద్

సాంకేతిక విద్య అత్యవసరం

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరమని హెూమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 5వ రోజు స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రకాశం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులు 'నేటి సమాజం గ్రంథాలయాల ఆవశ్యకత' అంశంపై వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష ఎంత ముఖ్యమో విద్యార్థుల ఎదుగుదలకు జాతీయ భాష హిందీ, ఇంగ్లీషు అంత అవసరమని అన్నారు. ఈ మూడు భాషలు నేర్చుకుంటేనే విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోగలరని అన్నారు తెలుగు భాషలో 56 అక్షరాలు ఉన్నాయని, అదే చైనా భాషలో 5500 అక్షరాలు ఉన్నా కూడా ప్రపంచాన్ని శాసించే విధంగా వారు చదువు, ఉపాధి రెండు వారు శ్వాసగా జీవిస్తారని అన్నారు. అందుకే వారు సాంకేతిక నైపుణ్యంలో ప్రపంచంలో ముందు వరుసలో ఉన్నారని అన్నారు. ఉపాధ్యాయులు మండవల్లి రాజు మాట్లాడుతూ విద్యలో కౌన్సిలింగ్, గ్రూపు చర్చలు అత్యవసరమని అన్నారు. అందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు డాక్టర్ యు దేపాలన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ మన్నం త్రిమూర్తులు, గ్రంథాలయ అధికారి సిహెచ్ విఎల్ వసుంధర దేవి, రొటేరియన్ మలాది శ్రీనివాసరావు, వెలనాటి రామారావు, తాళ్లూరి బాబురావు, జి ప్రసాద్, శశిధర్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న బల్లికురవ ఎఒ యల్లమందరెడ్డి

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని నక్కబొక్కలపాడు, మల్లయ్య పాలెం గ్రామాల్లో మంగళవారం పోలం పిలుస్తోంది నిర్వహించారు. ఎఒ బత్తుల యలమందరెడ్డి పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం, మొక్కల పెరుగుదలకు నత్రజని, భాస్వరం, పొటాషియం అవసరమని అన్నారు. నత్రజని ఆకుపచ్చని ఆకుల పెరుగుదలకు, భాస్వరం వేర్ల అభివృద్ధికి, పువ్వులు, పండ్ల ఉత్పత్తికి, పొటాషియం మొక్క ఆరోగ్యం, ఒత్తిడి నిరోధకతకు ఉపయోగపడతాయని వివరించా రు. నేల స్వభావం, పంట రకం, దశను బట్టి తగిన మోతాదులో వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ మౌలాలి, విఎఎలు రోజా, సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

అమృతలూరు : మండలంలోని ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ ఎం హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 19న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం పిఎం నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబు చేతుల మీదగా రెండో దఫా రైతులకు పెట్టుబడి సాయం రూ.2వేలు కేంద్రం, రూ.5వేలు రాష్ట్రం కలిపి రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. రైతులు ధాన్యం తోలుకునే వాహనాలను ఆర్ఎస్‌కెల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ బి మణికంఠ, విఎఎ డి భాస్కర్ పాల్గొన్నారు.

అద్దంకి : అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ 2వ విడత నిధులు బుధవారం విడుదల చేస్తున్నట్లు ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 9579 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు రూ.6.67 కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. కడపలో సిఎం చేతుల మీదుగా రైతుల ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. గ్రేడ్ ఏ రకం క్వింటాల్ రూ.2389, గ్రేడ్ బి రకం రూ.2369 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ ప్రసన్న, శివాని, ఎఇఒ కోటేశ్వరరావు, రాజశేఖర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నగరం : మండలంలోని ధూళిపూడి ఆర్ఎస్‌కె పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ వి రమేష్ బాబు రైతులకు ప్రస్తుతం వరి పంట ఉన్న దశను బట్టి పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. 19న అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద రైతులకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, కె వంశీకృష్ణ, పి స్వాగత లక్ష్మీ, విఎఎ నాగ రమేష్ పాల్గొన్నారు


మాట్లాడుతున్న నగరం ఎఒ రమేష్‌బాబు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు కోటి దీపోత్సవం సందర్భంగా ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. కార్తీక మాసం సందర్భంగా కోటి దీపోత్సవం ఏర్పాటు చేశారు. ఆలయ పాలక మండల అధ్యక్షులు చుండూరి మురళి సుధాకరరావు, సభ్యులు నూతి ప్రసాదు, వెంకటరత్నం, బత్తుల చంద్రశేఖర్, సురేష్ బాబు, ఎసి మదమంచి తిమ్మానాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి అశోక్ బాబు

వెంకటరెడ్డి అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏపి పోలీసులు అక్రమ అరెస్టు చేయటాన్ని వైసీపీ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు ఖండించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. ఏ పోలీసు స్టేషన్‌కు తీసుకువెళుతున్నారో తెలపాలని ఇంట్లో మహిళలు, పిల్లలు ప్రాధేయపడగా దారుణంగా మహిళ వద్ద ఫోన్లు లాక్కొని, విచక్షణ రహితంగా దుండగులు అపహరించిన రీతిలో వ్యవహరించిన పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసు వారే భక్షకులుగా మారి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయటం అత్యంత దుర్మార్గమని అన్నారు. వైసిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కారుమూరి వెంకటరెడ్డి స్వగ్రామమైన చుండూరు మండలం కారుమూరివారిపాలెంలో నివాసం ఉంటున్న వెంకటరెడ్డి తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి అండగా ఉంటారని అన్నారు. అక్రమ అరెస్టులతో బయటపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడేవారు లేరన్నారు. అనంతరం వైసీపీ సీనియర్ నాయకులు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డితో ఫోనులో మాట్లాడించారు. అశోక్ బాబు తోపాటు మాజీ ఎంపీటీసీ డి మోహనరెడ్డి, ఉయ్యూరు సుబ్బారెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, సుధీర్, బుజ్జి, అంజిరెడ్డి, నరేంద్రరెడ్డి ఉన్నారు.


విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

విద్యార్థులు మత్తుకు చిత్తు కావొద్దు

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులు మత్తుకు చిత్తై జీవితాలు నాశనం చేసుకోవద్దని దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, సీనియర్ సిటిజన్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ సువార్త అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈప్లెడ్జ్ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసి మాట్లాడారు. మత్తు పదార్థాలు మనిషిని శారీరకంగా, నైతికంగా, సామాజికంగా, ఆర్థికంగా దిగజారుస్తాయని అన్నారు. వాటి బారినపడి జీవితాన్ని నరకమయం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం రమాదేవి, ఎక్సైజ్ సూపర్నెంట్ బి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి ఎండి కె సాధిక్, రూరల్ సిఐ శ్రీనివాసరావు, కళాశాల స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డి నిరంజన్, ట్రైనర్ సైకాలజిస్ట్ పి అన్వేష్, ఎస్‌డి మతీన్, ఈగల్ టీం ప్రతినిధులు దుర్గాప్రసాద్, సురేష్, బదురుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ డీఎస్ రజని, ఎస్‌డి నాగూర్ బాష, చిన్నగంజాం కళాంజలి రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ప్రతినిధి చైతన్య పాల్గొన్నారు.

బట్టిప్రోలు : మాదక ద్రవ్య రహిత సమాజంగా అభివృద్ధికి కృషి చేయాలని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం మాచర్ల మోహనరావు అన్నారు. మండలంలోని ఐలవరం ఉన్నత పాఠశాల్లో అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని భట్టిప్రోలు సెక్టార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. దేశానికి యువత పట్టుకొమ్మలని, నషా ముక్తి భారత్ క్రింద సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ ఈ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మార్పు మనతోనే ప్రారంభం కావాలనే దృఢతతో ప్రతిజ్ఞ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ బి సంపూర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
బుధవారం 19 నవంబర్ 2025



సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వైద్య కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించాలని అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు ఆధ్వర్యంలో జరిగిన సంతకాల సేకరణలో వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కోడూరి ప్రసాదరెడ్డి, వైసిపి రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ హుమాయున్ కబీర్, గోసాల అశోక్, వాసుమళ్ళ వాసు, సురేష్ పాల్గొన్నారు.

27న రోటరీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ఈనెల 27న కోటపాడు జెడ్పి ఉన్నత పాఠశాల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు మంగళవారం తెలిపారు. 27న సాయంత్రం 2గంటల నుండి 4 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు ప్రతి పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులతో ఒక టీం ఏర్పడాలని కోరారు. 6, 7, 8 తరగతుల సిలబస్‌తోనే పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు పేర్ని వీరనారాయణను 90999 80916 నంబరులో సంప్రదించాలని కోరారు.



క్రీడా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక యార్లగడ్డ నాయడమ్మ హైస్కూల్ పరిధిలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. గ్రంథపాలకులు నాగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, విద్యార్థుల కోసం పరుగు పందెం, వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. క్రీడల్లో విజేతలకు నవంబర్ 20న బహుమతులు అందజేస్తామని గ్రంథపాలకుడు నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సామ్రాజ్యం, పిడి మస్తాన్ పాల్గొన్నారు.



కొల్లూరులో చిత్రలేఖన పోటీల దృశ్యం

కొల్లూరు : జాతీయ గ్రంథాల వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొల్లూరు పంచాయితీ కార్యదర్శి ఎం శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పుస్తకాలు చదువుకోవాలని కోరారు. సబ్ జూనియర్స్‌కు నచ్చిన బొమ్మలు, జూనియర్స్‌కు ప్రకృతి దృశ్యం, సీనియర్స్‌కు జల వనరుల సంరక్షణ అనే అంశాలపై చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం విద్యార్థుల్లో జ్ఞాపక శక్తిని పెంచుతుందని అన్నారు. ఆధునిక సాంకేతికత విస్తరించే కొద్ది చదవడం తగ్గిపోతుందని అన్నారు. దీనివలన నష్టం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై రాంబాబు, పి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిపై దాడి చేస్తే చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో పట్టణం లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి హెచ్చరించారు. పట్టణంలో అధిక మొత్తంలో ప్లాస్టిక్ నిల్వ ఉంచిన దుకాణంపై తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకుంటున్న సిబ్బందిపై దుకాణం యజమాని దాడికి పాల్పడిన సంఘటనపై ఆయన విలేకరులకు సమావేశంలో మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ప్లాస్టిక్ సమూలంగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు జారీ చేశాయని తెలిపారు. ఈనే పద్యంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, కవర్లు విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ నిల్వలున్న దుకాణంలో తనిఖీలు నిర్వహించే మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్లు, సిబ్బందిపై దుకాణం యజమాని దాడికి పాల్పడడంతో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత మైక్రాన్ల ప్లాస్టిక్‌నే వినియోగించాలని అన్నారు. భూమిలో కుళ్ళని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని సమూలంగా నిర్మించేందుకు పట్టణంలో మునిసిపల్ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను కొందరు వ్యాపారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ మేరకు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అనంతరం తనిఖీలు నిర్వహించి దుకాణంలో నిల్వ ఉన్న ప్లాస్టిక్‌ను తెచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదురు గుట్టగా వేసిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, కవర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఈ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు కరుణ, నజీర్ పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రైతులకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించటంలో ముందుంటున్నారని పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య అన్నారు. అందుకే వెల్లలచెరువు సొసైటీ జిల్లాలోనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. మండలంలోని వెల్లలచెరువులో 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా పిఎసిఎస్‌ను సందర్శించి సహకార జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ ఉండడంతో రికవరీ అవుతూ అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. వెల్లలచెరువులో కోల్డ్ స్టోరేజీ ఒకటి అవసరమని, ప్రతి రైతుకి భీమా కల్పించాలని సిఇఓ ఆంజనేయులు సీతారామయ్య దృష్టికి తీసుకువచ్చారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తామని, భీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడి వెంకటేశ్వరశర్మ, పిడిసిసి బ్యాంక్ సిఇఓ చైతన్య, డిసిఓ సూపరింటెంట్ ఉమాదేవి, పిడిసిసి బ్యాంక్ సంతమాగులూరు మేనేజర్ ఉమ, సూపర్వైజర్ వి ఏడు కొండల నాయక్, సజ్జాపురం సొసైటీ చైర్మన్ గంగ్రు అంకమ్మరావు, ఎడ్యుకేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి చింతా రామారావు, సిఈఓ ఆర్ ఆంజనేయులు, ఆలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిసిసిబి చైర్మన్ కె సీతారామయ్య

పెన్షన్ పంపిణీలో అంగన్వాడీలను మినహాయించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వ సామాజిక పెన్షన్ల పంపిణీలో అంగన్‌వాడీలను మినహాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు కొనసాగిస్తూనే ఉన్నారు. గత ఆగస్టు నెలలో అంగన్‌వాడీలను పెన్షన్ల పంపిణీతో పాటు ఏ ప్రభుత్వం కార్యక్రమాలకు వినియోగించరాదని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అనుసరించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనసాగించడం పట్ల అంగన్వాడీలు ఆగ్రహానికి గురవుతున్నారు. మండలంలో గత నెలలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు పెన్షన్ పంపిణీ నుండి మినహాయించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు అనుసరించి కొన్ని జిల్లాలు, మండలాల్లో అంగన్వాడీలను నిలహరించినప్పటికీ జిల్లాలోని అనేక మండలాల్లో కొనసాగిస్తూనే ఉన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ నెలలో మండలంలోని వెల్లటూరు, పెద్దపులివర్రు, భట్టిప్రోలు మండలాల్లో అంగన్వాడీ కార్యకర్తలతో పెన్షన్ పంపిణీ చేయించారని, రానున్న మాసానికైనా అంగన్వాడీలను పెన్షన్ పంపిణీ నుండి మినహాయించాలని కోరారు. ఈపాటికే అంగన్‌వాడీలకు అనేక యాప్‌లు ప్రవేశ పెట్టడం వలన ఉన్న ఫోన్లు సహకరించక పని భారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, తక్షణమే ఉన్నతాధికారుల స్పందించి అధికారులకు మినహాయింపు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ అంగన్వాడీలకు మినహాయించాలని జిల్లా అధికారుల నుండి ఆదేశాలు వస్తే తక్షణమే నిలిపివేస్తామని అన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లోని సిబ్బంది పంపిణీకి సరిపడకపోవడంతో అంగన్‌వాడీలను వినియోగించుకోవాల్సి వస్తుందన్నారు.

22న మార్టూరులో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సహకారంతో మార్టూరులో ఈనెల 22న శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారిని మాధవి మంగళవారం తెలిపారు. 16 బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, ఆర్బియల్ బ్యాంకు (ఎస్‌బిఐ), మెడ్‌ప్లస్ ఫార్మసీ, అరొబిందో ఫార్మా లిమిటెడ్ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 900కిపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.10వేల నుండి రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, బిటెక్, ఎంబిఏ, పిజి విభాగాల వరకు చదువుకున్న 18నుండి 30 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా లేదా రెస్యూమ్, విద్యార్హతల ధృవీకరణ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 99499 13437, 63027 64962 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్ పోర్టల్ నందు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ నాగరాజు

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - బల్లికురవ

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని దుకాణాలను ఎస్ఐ నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు ప్రభుత్వ నిషేధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. సమీపంలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎపిఎం శ్రీమన్నారాయణ

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల సమైక్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన ఈసీ సభ్యులకు విజన్ బిల్డింగ్‌పై మూడు రోజుల శిక్షణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు 40 మంది ఈసీ సభ్యులను నాలుగు టీంలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి టీంకు ఆరోగ్యం, విద్య, 2వ టీంకు వ్యవసాయం, సామాజిక భద్రత, 3వ టీంకు ఆస్తుల సృష్టి, ప్రవర్తనలో మార్పు, 4వ టీంకు సుస్థిర జీవనోపాధి, సామర్థ్ల పెంపు వంటి ఈ 8 అంశాలను లక్ష్యంగా ఇచ్చి ఒక ఆదర్శ గ్రామానికి మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు పరిశీలన చేపట్టేందుకు గ్రూపులుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే గ్రూప్ చర్చల ద్వారా ఆదర్శ గ్రామాలకు ఉండాల్సిన లక్షణాలు ఎపిఎం వివరించారు. కార్యక్రమంలో సమైక్య కోశాధికారి కట్టా జ్యోతి, సీసీలు నరేంద్ర, హనోక్, రజని, శిరీష పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామీణ ప్రాంతంలో విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత వంటి అంశాల్లో సమూల మార్పులు తీసుక రావడం ద్వారా గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దవచ్చని ఎపిఎం రాజారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్ కార్యక్రమంపై శిక్షణ ప్రారంభించారు. 8అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఓఏ అధ్యక్షులు రమాదేవి, సిసిలు పెరయ్య, ప్రమీల, డేవిడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

ప్రతి ఒక్కరూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు సోలార్ అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఈఈ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగులో ఉన్న వ్యవసాయ బకాయిలను, గృహల బకాయిలను వెంటనే వసూలు చేయాలని, బకాయిలు చెల్లించని వారి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఎల్ఐ, లైన్ ఇన్స్పెక్టర్లు సిబ్బందికి సూచించారు. మొండి బకాయిలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. వాటిని వసూలు చేయాలని అన్నారు. విద్యుత్ వినియోగదారులకు లో వోల్టేజ్ సమస్య లేకుండా చేయాలని కోరారు. నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని కోరారు. విద్యుత్ వినియోగదారులకు సమాధానాలు సక్రమంగా చెప్పాలని కోరారు. ఎవరితో గొడవలు పడకుండా విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ టి అంకబాబు, లైన్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవులయ్య.

20న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ 20న ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకుడు ఆవులయ్య తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే ప్రారంభించాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. గిద్దలూరులోని సగిలేరు ప్రాంతంలో లభ్యమవుతున్న ఎర్ర ఇసుకను ఉచితంగా సరఫరా చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికుల బోర్డును ప్రారంభిస్తామని, బోర్డుకు రూ. కోటి రూపాయలు విరాళం ఇస్తానని ఎన్నికల సమయంలో ప్రకటించారని ఈ సందర్భ:గా గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలని ఆవులయ్య కోరారు.

ఆవాస్ యోజన సర్వే వేగవంతం

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివద్ధి కార్యక్రమాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆవాస్ ప్లస్ 2024 సర్వేలో ప్రజలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే గహాలను వినియోగించుకోవాలన్నారు. ఆవాస్ ప్లస్ సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది, గహ నిర్మాణ శాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి నిబద్ధతతో పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఫొటోలను యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. సర్వే తీరుపై ప్రతిరోజు ఓ మండలాన్ని తనిఖీ చేయాలని హౌసింగ్ పీడీ ని ఆదేశించారు. తీర ప్రాంతాలలోని ప్రతి గహానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఐవిఆర్ఎస్ విధానం ద్వారా ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి, జడ్‌పి సిఇఒ, డిఎల్‌డిఒలు ప్రతిరోజూ ఓ గామాన్ని సందర్శించి పరిశీలించారు. స్వచ్ఛతలో ప్రతి గ్రామంలో 100 శాతం అభివద్ధి కనపడాలన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో వెనుకబడి ఉన్న పంచాయతీల ఎంపీడీవోలకు షో కాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. స్వచ్ఛ భారత్ పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సమర్ధంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరాలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరగాలన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద మంజూరైన పనులను అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. అందుకోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అనంతరం పురపాలక సంఘ పనితీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సమీక్ష నిర్వహించారు. పురపాలక సంఘంలో కమ్యూనిటీ టాయిలెట్ల అవసరతను గుర్తించి వాటికి ప్రతిపాదనలు పంపాలన్నారు. గోకులాల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో గహ నిర్మాణ శాఖ పీడి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అనంతరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, వీక్షణ సమావేశంలో సిపిఒ షాలేం రాజు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

కేంద్ర పథకాలపై మాగుంట చర్చ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంట్ కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో కమిటీ సభ్యులతో కలసి పలు కేంద్ర పథకాల అమలుపై అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర పాలిత ప్రాంత లక్షద్వీప్ ప్రభుత్వం, రాష్ట్ర గహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థికశాఖ మంత్రిత్వ, కవరట్టి స్మార్ట్ సిటీ, హడ్కో, యన్‌బిసిసి, కెనరా బ్యాంకు వంటి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. గహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలకు సంబంధించి స్వచ్ఛ్ భారత్ మిషన్ - అర్బన్, అమత్, పిఎం ఆవాస్. యోజన, పిఎంఎస్‌విఎ నిధి పథకాలు, కార్యక్రమాల పనితీరు - పురోగతి, కవరట్టి స్మార్ట్ సిటీలోని ఐసిసిసిఎస్‌పివి. నిర్వహణ, హడ్కో -ఎన్‌బిసిసి పనితీరుపై చర్చలు జరిపారు. చర్చలలో ప్రతినిధులు కోరిన సదుపాయాలు, చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

డిజిటల్ అరెస్ట్ పేరిట జరిగే సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగినట్లు తెలిపారు. ఫ్రాడ్ కాల్ స్కామ్‌ల ద్వారా సైబర్ మోసగాళ్ళు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపారు. నేరగాళ్లు ముందుగా ఆన్‌లైన్ ద్వారా మీ ఫోన్ నెంబరు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు లాంటి వ్యక్తిగత సమాచారాన్ని వివిధ మార్గాల ద్వారా సేకరిస్తారని తెలిపారు. మీ పేరు, చిరునామా, ఆధార్ నెంబర్ తో మీ పిల్లలు/భర్త/కుటుంబ సభ్యులు తప్పు చేసి తమ ఆధీనంలో ఉన్నారని లేదా మీ పాత అకౌంట్ లోన్స్ లో మోసం జరిగిందని, బ్లూ ఫిల్మ్ చూస్తున్నారని, మీ పేరుతో ఉన్న సిమ్ కార్డుతో మరొక వ్యక్తి నేరాలు చేశారని, సిబిఐ, ఇడి, కస్టమ్, ఎసిబి అధికారుల్లా వాయిస్/వీడియో కాల్ చేసి అసలు అధికారుల్లా ప్రవర్తిస్తూ మీతో మాట్లాడతారని తెలిపారు. పోలీస్ డిపార్టుమెంట్ లోగోస్ కనపడేలా, సెట్టింగ్ వేసిన పోలీస్ స్టేషను మరియు కోర్టుల నుంచి పోలీస్ యూనిఫాం, కోర్టు జడ్జి డ్రెస్‌లో కనిపిస్తూ మీతో మాట్లాడుతూ ఇంటరాగేషన్ చేస్తున్నట్లుగా నటిస్తారని తెలిపారు. ప్రశ్నల మీద ప్రశ్నలు అడిగి బయపెడతారని తెలిపారు.బ్యాంక్ అకౌంట్లను కూడా ఫ్రీజ్ చేస్తామని, ఆర్‌బిఐ నుంచి అనుమతి తీసుకొచ్చామని చెప్పి నకిలీ లెటర్ చూపిస్తారని తెలిపారు. బ్యాంకు అకౌంట్ లోని నగదను పోలీస్ డిపార్టుమెంట్ ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారని తెలిపారు. నేరం చేయలేదని రుజువు అయ్యాక ఆ డబ్బును తిరిగి మీకు ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మించి సైబర్ మోసగాళు అకౌంట్ల నుంచి లక్షల్లో కాజేస్తారన్నారు. ప్రజలు అలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు, సిబిఐ, కస్టమ్స్, విజిలెన్స్, ఇన్వెస్టిగేషన్ బ్యూరో అని సెంట్రల్ ఏజెన్సీస్ వారి పేరిట కాల్ చేసి భయపెట్టి, డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయమన్నా లేక బ్యాంకు అకౌంట్ వివరాలు, బ్యాంకు కార్డ్స్ వివరాలు, ఒటిపి మరియు ఇతర వ్యక్తిగత సమాచారం అడిగితే ఇవ్వొద్దని ఎస్‌పి తెలిపారు. లోకల్ పోలీసులను సంప్రదించకుండా మిమ్మల్ని ఎవరూ అరెస్ట్ చేయరని, తెలియని వాళ్ళ నుంచి అనుమానాస్పదంగా వీడియో కాల్స్ వస్తే కాల్ లిఫ్ట్ చేయకపోవడమే ఉత్తమమని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



మాట్లాడుతున్న ఎపి హర్షవర్ధన్‌రాజు

రైతుల ఖాతాల్లోకి

నేడు అన్నదాత సుఖీభవ నగదు

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద రైతులకు రెండో విడత ఆర్థిక సాయం పంపిణీని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండో విడత ఆర్థికసాయం పంపిణీపై జిల్లా అధికారులు మరియు మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలంలో పెట్టుబడిన తీర్చడం, రైతులకు మద్దతు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబాలకు మరియు ఆర్ఒఎఫ్ఆర్ భూమి సాగుదారులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.14, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు కలిపి మూడు విడతలుగా ఖరీఫ్,రబీ, వేసవిలో అందజేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద రెండో విడత ఆర్థిక సహాయ పంపిణీని బుధవారం నిర్వహించేదుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలిపారు. 2వ విడత కింద రాష్ట్రం నుంచి రూ.5 వేలు, కేంద్రం నుంచి రూ.2 వేలు మొత్తం రూ.7 వేలు లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి కార్యక్రమాన్ని మధ్యాహ్నం 1 గంటకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్ఆర్ కడప జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండో విడత పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఆచార్య ఎన్‌జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 326 రైతు సేవా కేంద్రాల వద్ద భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాలను ప్రత్యక్షంగా తిలకించేలా స్మార్ట్ టివిలు ఏర్పాటు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ రెండో విడత ఆర్థిక సాయం ప్రతి లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. బాపట్ల జిల్లాలో 1,60,441 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, మార్కెఫెడ్ డిఎమ్ కరుణశ్రీ, జిల్లా కోఆపరేటివ్ అధికారి శాంసన్, సేంద్రీయ వ్యవసాయ డిపిఎం హుస్సేన్, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ భావన, రెవెన్యూ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్